దశ, దిశలేని పాలన దేశానికి గొడ్డలిపెట్టు

- ప్రజలు తమ ఆకాంక్షలను గెలిపించుకోవాలి
- ఎన్నికల అక్రమాలను నిలువరించడంలో ఇసి విఫలం : సిఎం కెసిఆర్
- మధ్యప్రదేశ్ నాయకులను బిఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన కెసిఆర్



మధ్యప్రదేశ్ నుంచి పలువురు రాజకీయ నాయకులు బిఆర్ఎస్ పార్టీలోకి చేరిన సందర్భంగా మాట్లాడుతున్న సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా కేంద్రంలోని పాలన ఇంకా లక్ష్యాన్ని విస్మరించి నిర్లక్ష్యం గానే కొనసాగుతున్నదని, దశ దిశ లేని పరిపాలన దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా పరిణమించిందని సిఎం కెసిఆర్ అన్నారు. ఈ దిశగా చైతన్యమై, పార్టీలను కాకుండా తమ ఆకాంక్షలను గెలిపించుకోవాల్సిన అవసరమున్నదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇంకా కూడా... పార్టీ ఫౌండర్లు సిద్దాంతకర్తలు తాతల తండ్రుల పేర్లు చెప్పుకోని రాజకీయాలు చేసే పరిస్థితులు చెల్లవని, ఇప్పుడు దేశ ప్రజలకు ' పేర్లతో పనిలేదు.. పని చేయగలిగిన వాల్లతోనే పని (నామ్ దారీ నహీ కామ్ దారీ హెూనా చాహియే) అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలోకి మహారాష్ట్ర తో పాటు మధ్యప్రదేశ్ నుంచి కూడా చేరికలు ఊపందుకున్నాయి. బిఆర్ఎస్ పార్టీ విధానాలు, పార్టీ జాతీయ అధ్యక్షులు సిఎం కేసీఆర్ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నచ్చిన మధ్యప్రదేశ్ సీనియర్ రాజకీయ నేతలు, మేధావి, సామాజిక తదితర వర్గాలు పార్టీలో చేరుతున్నారు. మధ్యప్రదేశ్ బిఆర్ఎస్ సమన్వయకర్తగా మాజీ ఎంపి బుద్దసేన్ పటేల్‌ను అధినేత నియమించడంతో అక్కడ పార్టీ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో పటేల్ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ కు చెందిన మాజీ ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు సహా మరో రెండువందల మంది కీలక రాజకీయ నేతలు ఆదివారం నాడు అధినేత సిఎం కెసిఆర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మధ్యప్రదేశ్ బిఆర్ఎస్ సమన్వయకర్త మాజీ ఎంపీ బుద్దసేన్ పటేల్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారిలో...చాంద్వాడా జిల్లా, జున్నార్ దేవ్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే రామ్ దాస్ యికే సర్వజన్ కల్యాణ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు సంజయ్ యాదవ్, గోండ్వానా పార్టీ అధ్యక్షుడు శోభారామ్ బాలావి, భువన్ సింగ్ కోరం, లక్ష్మణ్ మస్కోలే తో పాటు దాదాపు 200 మంది సీనియర్ రాజకీయనాయకులు ప్రజా సంఘాల నేతలు మేధావులు తదితరులు బిఆర్ఎస్ లో చేరారు.

బిఆర్ఎస్ పార్టీలోకి మధ్యప్రదేశ్ నుంచి పలువురు రాజకీయ నాయకులు చేరిన సందర్భంలో బిఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు సిఎం కెసిఆర్ మాట్లాడుతూ... ఈ దేశంలో ప్రకతి ప్రసాదించిన నీరు, వ్యవసాయ యోగ్యమైన భూమి, విద్యుత్ కు అవసరమైన బొగ్గు నిల్వలు, వ్యవసాయానికి అవసరమైన సమతల శీతోష్ణస్థితి సూర్యరశ్మి తదితర ప్రకృతి వనరులన్నీ అందుబాటులో వున్నాయని వివరించారు. అన్నీ వున్నా కూడా ఇంకా దేశ రైతాంగం ఆత్మహత్యలు చేసుకోవడం శోచనీయమన్నారు. కేంద్రంలోని పాలకులకు లక్ష్యశుద్ధి లోపించడమే ఇందుకు కారణమన్నారు. దళితులు బహుజనులు సహా అన్ని వర్గాలు 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో ఇంకా అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితి పోవాలంటే కేంద్రంలో పార్టీలను మార్చడం కాకుండా తమ ఆకాంక్షలను గెలిపించుకునే దిశగా చైతన్యం కావాలని సిఎం పిలుపునిచ్చారు. " వొక పార్టీని వోడించి ఇంకో పార్టీని గెలిపిస్తే ఆ పార్టీల పేర్లే మారుతాయి. ఆ నాయకుల పేర్లు మారుతాయి ...కానీ ప్రజలకు వొరిగేదేమీ లేదు. ఈ నేపథ్యంలో పనివిధానం లో మార్పు తీసుకువచ్చే ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలదే (నామ్ బదల్నేసే కుచ్ నహీ హెూతా...కామ్ బదల్నా చాహియే) అని స్పష్టం చేశారు.

బిఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే గెలిచిన రెండేండ్లల్లో భారతదేశ ప్రజలకు రైతాంగానికి అవసరమైన విద్యుత్తును 24 గంటలు అందచేస్తామని సిఎం పునరుద్ఘాటించారు. బిఆర్ఎస్ పార్టీ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని, భారత దేశాన్ని మార్చడానికి ఏర్పాటు చేసిన మిషన్ అని స్పష్టం చేశారు. మన వోటును పని చేయనివాల్లకు కాకుండా మన కోసం పనిచేసుకునే వాల్లకు వేసుకుంటేనే మన ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. ప్రస్థుతం తెలంగాణ లో దశాబ్ది ఉత్సవాలు కొనసాగుతున్నాయని తెలిపిన ముఖ్యమంత్రి తెలంగాణలో అమలు చేస్తున్న దళితబంధు రైతుబంధు రైతుబీమా ఉచిత విద్యుత్ ఆసరా ఫించన్లు వంటి పథకాల గురించి వివరించారు. తెలంగాణలో అమలవుతున్నప్పుడు మధ్యప్రదేశ్ లో ఎందుకు అమలు కావని ప్రశ్నించారు. ఇదే ప్రశ్నను కేంద్రాన్ని అడగాలన్నారు. మన కష్టాలను ఇతరులు తీర్చరని మనమే తీర్చుకోవాల్సి వుంటుందన్నారు.

ఈ దేశంలో ఏడు దశాబ్దాలు దాటినా ఆదీవాసీలు దళితులు బహుజనులు పీడితులుగానే కొనసాగాల్సిన దుస్థితి ఇంకెన్నాళ్లు..అని ప్రశ్నించారు. ఇప్పటికే ఉత్తరభారతంలో కనీస జీవన విలువలు లేకుండా వివక్షకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

భారత దేశం మార్పు కోరుకుంటున్నదని, ఈ దిశగా బుద్ధిజీవులు ఆలోచన చేయాలన్నారు. మేధావి వర్గం ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా కలిసి రావాలన్నారు. 'దిల్ వాలే దిమాఖ్ వాలే' ఐక్యం కావాల్సిన అవసరమున్నదన్నారు.

తప్పుడు వాగ్దానాలతో విద్వేషాలు రెచ్చగొడుతూ ఏమైనా చేసి ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా కొనసాగుతున్న దుర్మార్గాలను నిలవరించడంలో ఎలక్షన్ కమిషన్ వైఫల్యం చెందిందని దుయ్యబట్టారు. త్వరలోనే మధ్యప్రదేశ్ భోపాల్ లో బిఆర్ఎస్ పార్టీకి స్వంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. మధ్యప్రదేశలోని అన్ని నియోజకవర్గాల్లో వాహనాలను ఏర్పాటు చేసుకుని పార్టీ భావజాలాన్ని ప్రచార సామాగ్రిని గ్రామ గ్రామన తిప్పాలని ప్రజలను చైతన్యం చేయాలని అధినేత స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రతి గ్రామంలోరైతు దళిత మహిళ యువ బీసీ వంటి 9 కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా...బిఆర్ఎస్ నేతలు శంకరన్న దోంగ్డే, మాణిక్ కదమ్, హిమాన్షు తివారి, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, మెట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక ఆనవాళ్లు తెలంగాణలో బైటపడటం గర్వకారణం

భారత జాగృతి ప్రచురించిన తెలంగాణ చరిత్ర సంపుటాలను ఆవిష్కరించిన సిఎం

తెలంగాణ చారిత్రక వారసత్వం మహెూన్నతమైందని, కోట్లాది సంవత్సరాల చరిత్రకు తెలంగాణ సాక్ష్యంగా నిలవడంపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ఆనందం వ్యక్తం చేశారు. దాదాపు 20 కోట్ల సంవత్సరాల కిందటి చారిత్రక ఆనవాళ్లు రాష్ట్రంలో లభ్యంకావడం మనకు గర్వకారణమన్నారు. ఈ దిశగా చరిత్రకారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తెలంగాణ చరిత్రను భావితరాలకు తెలిపేలా భారత జాగృతి సంస్థ ప్రచురించిన.. తెలంగాణ చరిత్ర పుస్తకం 5 సంపుటాలను.. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో సాహిత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రగతి భవన్‌లో సీఎం ఆవిష్కరించారు.

భారత జాగృతి చరిత్ర విభాగం గత ఆరేళ్లుగా తెలంగాణలోని అనేక చారిత్రక ప్రదేశాలను, చరిత్రకారుడు రచయిత శ్రీరామోజు హరగోపాల్ ఆధ్వర్యంలో పలువురు చరిత్రకారులు సందర్శించారు. క్షేత్రస్థాయిలో పరిశోధన చేసి సేకరించిన సమాచారాన్ని, మామిడి హరికష్ణ, వేముగంటి మురళీకృష్ణ సంపాదకత్వంలో పుస్తకాలకు రూపకల్పన చేశారు. చరిత్ర రచన కోసం ఆయా ప్రదేశాలలోని శిలాజాలు, కట్టడాలు, శాసనాలు, నాణేలు, గ్రంథాలు సహా అన్ని రకాల చారిత్రక ఆధారాలను అధ్యయనం చేసినట్లు వారు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ దాదాపు 20కోట్ల సంవత్సరాల పైబడిన చరిత్ర ఆనవాళ్లు రాష్ట్రంలో లభ్యమవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆయా కాలాల్లో కొనసాగిన సామాజిక పరిస్థితులు, పరిపాలన రీతులు, నాటి దార్శనికతను అర్థం చేసుకుంటే రేపటికి మనకు దారి చూపుతాయని తెలిపారు. గత చరిత్రను అర్థం చేసుకోవడం ద్వారా, వర్తమానాన్ని అవగాహన చేసుకుంటూ తద్వారా భవిష్యత్‌కు బాటలు వేసుకోగలమని పేర్కొన్నారు. అనంతరం జాగృతి చరిత్ర విభాగం బాధ్యులతో పాటు సంస్థ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను సీఎం అభినందించారు. కార్యక్రమంలో చరిత్రకారుడు రచయిత శ్రీరామోజు హరగోపాల్, కవి సంపాదకులు వేముగంటి మురళీకృష్ణ, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్, భారత జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

నేను యోగా చేస్తున్నా.. మరీ మీరెందుకు చేయరు..?

- అందరూ ఆరోగ్యంగా ఉండాలి : గవర్నర్ తమిళి సై
- కీర్తిరెడ్డి ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండు రాష్ట్రాలకు గవర్నర్‌గా ఉన్న తాను యోగా చేస్తున్నానని.. మరీ మీరెందుకు చేయరని, అందరూ యోగా చేయాలని తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ తెలిపారు. కీర్తిరెడ్డి ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో హోలిస్టిక్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం హైదరాబాద్‌లోని బోరబండలోని నాట్కో ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గవర్నర్ తమిళిసై, ఎబివి ఫౌండేషన్ చైర్ పర్సన్ కావ్యారెడ్డి, హెూలిస్టిక్ ఆస్పత్రి ఎండి డాక్టర్ ఆలూరి తుషారా హాజరయ్యారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కీర్తిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పేదలకు ఇలాంటి మెడికల్ క్యాంప్‌లు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. లైఫ్ ఈజ్ ఫుల్ ఆఫ్ ఛాలెంజస్ అని.. వాటిని ఎదుర్కోవాలంటే మనందరం ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. తెలంగాణ ప్రజలు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారన్నారు. తన భద్రతా సిబ్బంది ఇక్కడకు రావొద్దని హెచ్చరించినా ఇక్కడ వీధులు ఇరుకు కానీ ప్రజల కోసం చేపట్టిన కార్యక్రమం గొప్పది అని వచ్చానన్నారు. ప్రతి సంవత్సరం అందరూ విధిగా హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. కీర్తిరెడ్డి ఫౌండేషన్ చైర్ పర్సన్ జూటూరి కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని తెలిపారు. అనంతరం కావ్యారెడ్డి మాట్లాడుతూ.. మంచి ఆహారపు అలవాట్లు మాత్రమే మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అందరూ యోగా చేయాలని చెప్పారు. జంక్‌ఫుడ్ తినొద్దని, పిల్లలు ఏం తింటున్నారో పెద్దలు గమనించాలని సూచించారు. అనంతరం ప్రధాని మోడీ చేపట్టిన టిడి ఎరాడికేషన్ కార్యక్రమంలో భాగంగా వ్యాధిగ్రస్తులకు గవర్నర్ చేతుల మీదుగా న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో బిపి, షుగర్, ఇసిజి, 2డిఎకో, కంటి పరీక్షలు, బోన్ డెన్సిటీటెస్ట్, గైనకాలజీ, మాతృ సంరక్షణకు సంబంధించిన వివిధ సేవలను వైద్యులు అందించారు. హెల్త్ క్యాంపునకు 300 మందికిపైగా ప్రజలు హాజరయ్యారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

అమరవీరుల స్మారక చిహ్నం పనులు

పరిశీలించిన మంత్రి వేముల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అమరవీరుల స్మారక చిహ్నం నిర్మాణ పనులు, నిమ్స్ శంకుస్థాపన ఏర్పాట్లను రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. హుస్సేన్ సాగర్ తీరాన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం పనులను పరిశీలించి అధి కారులకు కొన్ని సూచనలు చేశారు. మెట్రో పాలిటన్ కమిషనర్ అరవింద్‌కుమార్‌కు నిర్మాణ ప్రాంగణ వెలుపల గల రోడ్డు, ఫుట్‌పాత్, సుందరీకరణ అంశాలపై పలు సూచనలు చేశారు. మంత్రితోపాటు ఆర్ అండ్ బీ ఈఎన్సీ గణపతిరెడ్డి, ఎస్ఇ హఫీజ్, ఇఇ శశిధర్, డిఇ మోహన్, మాధవి, నిమ్స్ డైరెక్టర్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

17న హార్టీకల్చర్ ఆఫీసర్స్ పరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఈ నెల 17న పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ రోజు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు వరకు ఈ పరీక్ష జరుగుతుందని వెల్లడించింది. అభ్యర్థులు టిఎస్‌పిఎస్‌సి వెబ్‌సైట్ నుంచి ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటల నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. పరీక్షకు 45 నిమిషాల ముందు వరకూ హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపింది. పరీక్ష కంటే ముందు అభ్యర్థులు ప్రాక్టీసు కోసం వెబ్‌సైట్ ద్వారా మాక్‌టెస్ట్ రాసే అవకాశం కల్పించినట్లు పేర్కొంది.

బ్రెయిన్ స్ట్రోక్‌తో.. ములుగు జడ్‌పి చైర్మన్ మృతి

- సంతాపం తెలిపిన సిఎం కెసిఆర్, మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి
- నేడు అంత్యక్రియలు...హాజరుకానున్న మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా పరిషత్ చైర్మన్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కుసుమ జగదీష్(47) ఆదివారం హఠాన్మరణం చెందారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో అస్వస్థతకు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు హన్మకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే జగదీష్ మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. కాగా, జగదీష్ ఈ ఏడాది ఏప్రిల్ 1న సైతం గుండెపోటుతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆయన భార్య రమాదేవి సిపిఆర్ చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఇప్పుడు అదే తరహాలో మరోసారి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో జగదీష్ మృతి చెందారు. మృతుడు జగదీష్‌కు భార్య రమాదేవి, కుమారుడు వెంకట సత్యదేవ్, కూతురు హర చందన, తల్లిదండ్రులు ఉన్నారు. కాగా, సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు జరిగే ఆయన అంత్యక్రియల్లో మంత్రి కెటిఆర్ పాల్గొననున్నారు.

జగదీష్ కుటుంబానికి అండగా ఉంటాం: సిఎం కెసిఆర్

ములుగు జెడ్‌పి చైర్మెన్, కుసుమ జగదీష్ అకాల మరణం పట్ల సిఎం కెసిఆర్ తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారుడిగా నాటి ఉద్యమంలో జగదీష్ పోషించిన చురుకైన పాత్రను, ములుగు జిల్లా పార్టీ అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ చైర్మెన్‌గా జగదీష్ చేసిన సేవలను సిఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

ఆయన హఠాన్మరణం బాధాకరం : మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి

బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మెన్ కుసుమ జగదీష్ హఠాన్మరణం బాధాకరమని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ అన్నారు. ఆదివారం ములుగులోని జగదీష్ స్వగృహంలో జగదీష్ పార్థివ దేహానికి నివాళులర్పించిన అనంతరం మంత్రులు మాట్లాడారు. నిన్న మొన్నటి వరకు కలివిడిగా తిరిగిన జగదీష్ మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ములుగు ప్రాంత అభివృద్ధికి కావాల్సిన నిధుల గురించే అడిగేవారని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి బిఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో.. మాజీ ఎంపి సీతారాం నాయక్, జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గోవింద్ నాయక్, స్థానిక సర్పంచ్ చంద కుమారస్వామి, తదితరులు ఉన్నారు.

నేడు తెలంగాణా రన్ :

- విజయవంతం చేయండి
- ప్రభుత్వ ప్రకటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం తెలంగాణా రన్ జరగనుంది. దీనికి ప్రజలంతా విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్‌లో సోమవారం ఉదయం ఆరు గంటలకు నెక్లెస్ రోడ్‌లోని డాక్టర్. బిఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలోని మైదానం 2కే, 4 కే రన్ ఉంటుందని తెలిపింది. అందులో దాదాపు ఐదువేల మంది రన్నర్లు పాల్గొననున్నట్టు తెలిపింది. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొంటారు.

అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులూ పాల్గొంటారు. ప్రారంభానికి ముందు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, బెలూన్స్ ఎగురవేయడం లాంటి కార్యక్రమాలు నిర్వ హించనున్నారు.

అవయవదానంలో తెలంగాణ నెంబర్ 1

- మంత్రి హరీశ్‌రావు
- 'లిటిల్ స్టార్స్ అండ్ షీ' ప్రయివేట్ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీతి అయోగ్ నివేదిక ప్రకారం వైద్య రంగంలో అవయవదానంలో దేశంలో తెలంగాణ నెంబర్ వన్ అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. అలాగే హెల్త్ హబ్‌గా తెలంగాణ రాష్ట్రం ఉందని, గ్లోబల్ సిటీగా హైదరాబాద్ ఎదిగిందని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో 'లిటిల్ స్టార్స్ అండ్ షీ' ప్రయివేటు ఆస్పత్రిని ప్రముఖ సినీ దర్శకులు ఎస్ఎస్ రాజమౌళితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో రాష్ట్రం గణనీయ పురోగతి సాధిస్తోందన్నారు. సూపర్ స్పెషాలిటీ ఎంసిహెచ్‌లను గాంధీ, నిమ్స్‌లో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. వచ్చే నెలలో గాంధీ ఆస్పత్రిలో సేవలు ప్రారంభం కానున్నాయన్నారు. అలాగే త్వరలోనే పది వేల పడకల సామర్థ్యంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు తెలిపారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేశారని సినీ

దర్శకులు రాజమౌళిని మంత్రి అభినందించారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో పేషెంట్ కేర్, సెక్యూరిటీ, ఇతర సేవలకు సంబంధించిన వ్యయాలను భరించేందుకు రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సతీష్, స్థానిక కార్పొరేటర్ మన్నే కవిత గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE 82nd ADDL. CITY CIVIL & SESSIONS JUDGE COMMERCIAL COURT AT BENGALURU (CCH-83)

COM. Mis. No. 86/2022

Petitioner : Surfaces Partnership Firm, Office at No. 180/1, Old Mangammanapalya Road, Bommanahalli, Near Gold Hills Square Building, Hosur Road, Bangalore-560068.

V/s.

Respondent : M/s Epic Sales Distributions India Pvt. Ltd., Office at Flat No. D1, 2nd Floor, GRC Residency, Behind Prithvi Solutions, Plot No. 19/C, Sy.No. 11/7, Chand Nayak Nagar, Madapur, Hyderabad, Telangana-500081.

NOTICE

This is to inform that petitioner company M/s Surfaces partnership Firm, represented by its Proprietor Sri Santhosh has filed a petition COM. MIS. 86/2022 on the file of the Hon'ble City Civil Judge Commercial Court (CCH 83) at Bengaluru, against respondent's company M/s Epic Sales Distributions India Pvt. Ltd., represented by its Managing Director to restore the suit i.e., COM. O.S. No. 706/2022. Petitioner has exhausted all the avenues to serve the notice on the respondent. But respondent is avoiding the notice for the reasons known to him. The Hon'ble Court has issued petition notice by substituted service in the form of Paper Publication. Hence, my client has complied the Order passed by the Hon'ble Court taking out notice to the respondent by substituted service in the form of Paper Publication. Hence, you the respondent's company M/s Epic Sales Distributions India Pvt. Ltd., represented by its managing director, residing in the given address is called upon to appear before the court **on 10.07.2023** Personally or represented by an Advocate to defend your case. Your failure will be noticed by the Hon'ble Court and the further proceedings will be held and the case will be decided in your absence.

Given under my hand and seal of the court on this 08.06.2023.

By Order of the Court, Sheristedar, City Civil Court, Bangalore.

Sri. H.M. Madhusudhana, Advocate
Manjunatha Law Chamber
#28, 2nd PLD Bank Complex,
Taluk Office Circle, Doddaballapur-561203.

ములుగు జిల్లా జెడ్‌పి చైర్మన్ మృతి పట్ల సిఎం దిగ్భ్రాంతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీష్ అకాల మరణం పట్ల సిఎం కెసిఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల మంత్రులు కెటిఆర్, శ్రీనివాసగౌడ్ సంతాపాన్ని తెలిపారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కెటిఆర్ వ్యాఖ్యలు అర్థరహితం : నిరంజన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజా దర్బార్ ప్రచార ఆర్భాటామంటూ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని టిపిసిసి ఉపాధ్యక్షులు జి నిరంజన్ చెప్పారు. ఆయన అవివేకానికి, అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కెటిఆర్ దుందుడుకుతనంతో మాట్లాడటం మానుకోవాలని హెచ్చరించారు. ప్రజా దర్బార్‌లో ఎంతో మంది మేధావులు, వివిధ రంగాలలోని నిష్ణాతులు తమ సూచనలు, సలహాలు సిఎంకు ఇచ్చే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు.

గుర్తించి మరిచారా..

- బిసి 8 13 సంచార కులాల ఆవేదన
- ఎంబిసి జాబితాలో చేర్చని వైనం
- రూ.లక్ష ఆర్థిక సాయం పథకం కోసం వేడుకోలు
- ఎమ్మెల్సీ కవిత, బోయినపల్లి వినోద్‌కుమార్‌కు వినతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యానంతరం సైతం సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్నాయి 13 సంచార జాతులు. విద్య, ఉపాధి సామాజిక న్యాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆమడ దూరంలోనే ఉన్న ఈ జాతులను తెలంగాణ రాష్ట్రం వచ్చాక రాష్ట్ర క్యాబినెట్ ఆమోదంతో ప్రభుత్వం బిసి-ఎ జాబితాలో చేర్చింది. జిఒ ఎం.ఎస్.నెం.03 తేదీ 09-09-2020 ప్రకారం బిసి-ఎలుగా గుర్తించబడిన విద్యార్థులకు విద్యా అవకాశాలు, యువతకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వస్తాయని ఎంతగానో ఆశపడ్డారు. కరోనా కాలంలో కుల గుర్తింపు రావడం.. ప్రభుత్వాలు సైతం ఆర్థిక సంక్షోభంలో ఉండటంతో కేవలం వినతిపత్రాలు సమర్పించి ఊరుకున్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం పథకంలో తమ కులాల పేర్లు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

దశాబ్ద కాలంగా జిల్లా కలెక్టర్లతోపాటు ఎస్సి, ఎస్టి, బిసి కమిషన్లు, ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులకు వందల విన్నపాలు సమర్పించగా సంచార జాతులను గుర్తించారు. అప్పటి బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, బీసీ కమిషన్ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకొని గుర్తింపునివ్వడంతో ఆ జాతుల వారు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబురాలు చేసుకున్నారు. కులవృత్తులు అంతరించి కార్మికులుగా, ఉపాధి కూలీలుగా, భిక్షాటన చేస్తూ జీవించే ఈ జాతులు రూ.లక్ష ఆర్థిక సాయానికి నిజమైన అర్హులు. రాష్ట్ర ప్రభుత్వం ఈ 13 కులాల ప్రతినిధులతో చర్చించి రూ.లక్ష ఆర్థికసాయం పథకంలో 10 శాతం వాటాను అందిస్తే జీవన ప్రమాణాలు కొంతైనా మెరుగుపడతాయని వివిధ ప్రజాసంఘాల



నేతలు భావిస్తున్నారు. ఈ విషయమై నిజామాబాద్‌లో ఓడ్ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ శరత్ ఎమ్మెల్సీ కవితను, శ్రీ క్షత్రియ రామజోగి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంగల రాంప్రసాద్ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్‌కు వినతిపత్రాలు అందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి ఈ జాతుల వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం కట్టుబడి ఉండాలి

జాదవ్ శరత్, ఓడ్ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నిజామాబాద్

అట్టడుగు స్థాయిలో ఉన్న సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలి. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల గెలుపోటములలో సంచార జాతుల ఓట్లే కీలకంగా మారనున్నాయి. తమ సంక్షేమాన్ని పట్టించుకోని పార్టీలను ఈ ఎన్నికల్లో ఐక్యంగా ఓడిస్తాం..

సంచార కులాలకు ఆర్థిక స్వాలంబన కల్పించాలి

కొంగల రాంప్రసాద్, శ్రీక్షత్రియ రామజోగి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బీసీ కులాలకు ఆర్థిక సహకారం అందించడం సంతోషకరం. సంచార జాతులకు సైతం ఆర్థిక స్వాలంబన కల్పిస్తే ఈ కులాలు తెలంగాణ ప్రభుత్వానికి ఎల్లవేళలా రుణపడి ఉంటాయి. ఈ కులాలను ఎంబీసీలలో చేర్చి రుణ సహకారం, ఆత్మగౌరవ భవనాలను నిర్మించి ఆత్మ గౌరవాన్ని పెంపొందించేలా కృషి చేయాలి.

13 సంచార జాతి కులాల అభివృద్ధికి కృషి చేయాలి

చవాన్ మోహన్, బైలు కమ్మర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, 13 కొత్త కులాల రాష్ట్ర అధ్యక్షులు, చేవెళ్ల

దశాబ్ద కాలం పోరాటం చేసి గుర్తింపు పొందిన 13 సంచార జాతి కులాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలి. విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధితోపాటు ఆత్మగౌరవ భవనాలను నిర్మించి.. ఏడు దశాబ్దాల వెనుకబాటు నుంచి బయట పడేందుకు మార్గదర్శనం చేస్తే ఈ కులాల భవిష్యత్తుకు బంగారు బాట వేసినట్టవుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి సంచార జాతుల సంక్షేమానికి కృషి చేయాలి.

IN THE COURT OF THE III[RD] JUNIOR CIVIL JUDGE,
CITY CIVIL COURT, AT HYDERABAD.

O.S. No. 2595 of 2023

Between:

1. Gunda Yadagiri, S/o. Late G.Narayana, and others ....Plaintiffs

AND

1. The Mandal Revenue Officer, and another ...Defendants.

NOTICE

To
To whom so ever it may concern.

The general public is hereby informed that the above named plaintiffs filed the above suit for declaration of legal heirs of LATE Smt. Gunda Kamalamma expired on 28-02-2023, and the suit is posted to 05-07-2023 for appearance of objectors. If anybody any objection in the above case make it convenient to appear before the above Hon'ble court at 10.30AM on 05-07-2023, either in person or through an Advocate duly instructed by you. If you fail to appear before the Hon'ble court on 05-07-2023, the matter will be decided on merits in your absence.

//BY ORDER OF THE COURT//

G. Nagabhushana Reddy
Advocate
Sree Nilayam
H.No.16-2-738/7A, FerHills, Asmangadh, Behind TVTower, Malakpet, Hyderabad – 500036.
Cell No.9948993499.

'పాఠాలు' నేర్వట్లే..!

- నేటి నుంచి పాఠశాలలు... సమస్యలు యథాతథం
- ప్రారంభం రోజు పుస్తకాలు, యూనిఫామ్స్ కష్టమే..!
- నత్తనడకన మన ఊరి మన బడి పనులు
- భారీగా ఉపాధ్యాయ ఖాళీలు.. వలంటీర్ల నియామకానికి డిమాండ్

పాఠశాలలో ఇంకా కొనసాగుతున్న మరమ్మతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేసవి సెలవుల అనంతరం రాష్ట్రంలో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయి. ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వం అనేక ప్రణాళికలు రూపొందించుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభం రోజే పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్‌తో పాటు టై, బెల్ట్, షూస్ విద్యార్థులకు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. సమస్యలు లేకుండా స్కూళ్లను ప్రారంభించాలని, విద్యార్థులకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని సూచించింది. కానీ ఎప్పటిలాగే ఈ ఏడాదీ అరకొర వసతులతోనే ప్రభుత్వ బడులు ప్రారంభం కాబోతున్నాయి. మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ విద్యా వ్యవస్థకు దీటుగా తీర్చిదిద్దేందుకు మన ఊరు మనబడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినా పనులు నత్తనడకన నడుస్తున్నాయి. పనులు పూర్తయిన చోట స్కూల్స్ మెరుగుపడ్డాయి. టీచర్ల ఖాళీలు షరామామూలే.. స్కూల్స్ ప్రారంభం నాటికే ఖాళీ పోస్టుల్లో విద్యావాలంటీర్లను నియమిస్తామని చెప్పినా ఇప్పటివరకు ఏర్పాట్లు జరగలేదు. బడిబాట ఈ నెల 17 వరకు కొనసాగనుంది. అన్ని పాఠశాలల్లో కంప్యూటర్ విద్య హామీగానే ఉంది. మరోవైపు ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో ఈ ఏడాది ఫీజులమోత బాగానే మోగుతోంది.

కనిపించని 'స్వచ్ఛ'త..

రాష్ట్రంలో 26,065 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 1.06 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 60 లక్షల మంది విద్యార్థులుంటే.. ప్రభుత్వ స్కూళ్లలోనే సుమారు 26 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో రాష్ట్రంలో 16 వేల మంది దాకా ఉన్న స్వచ్ఛ కార్మికులు ప్రస్తుతం లేరు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్ కార్మికులు పాఠశాల పరిసరాలను మాత్రమే శుభ్రం చేస్తున్నారు. తరగతి గదులు, స్టాఫ్‌రూమ్‌లు, మరుగుదొడ్లను మాత్రం శుభ్రం చేయడం లేదు. జిహెచ్ఎంసి పరిధిలో 690 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. పాఠశాలలో 40మందిలోపు విద్యార్థులు ఉంటే ఒకరిని రూ. రెండు వేలు, అంతకంటే ఎక్కువ విద్యార్థులుంటే ఇద్దరు కార్మికులకు రూ.2,500 చొప్పున వేతనంతో నియమించారు. ఉన్నత పాఠశాలల్లో వందలాది మంది విద్యార్థులకు వీరి సేవలు కీలకంగా మారాయి. కానీ రెండేండ్ల క్రితం ప్రభుత్వం సర్కారు బడుల్లో స్కావెంజర్లను తొలగించడంతో సుమారు 821 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. స్కావెంజర్ల వ్యవస్థ పునరుద్ధరణ అంశం ప్రభుత్వ పరిధిలో ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఉపాధ్యాయులు సొంత డబ్బులతో కార్మికులను నియమించుకుని పారిశుధ్య పనులను చేయిస్తున్నారు. బాలికల పరిస్థితి వర్ణనాతీతం. ఈ విద్యాసంవత్సరం స్వచ్ఛ కార్మికులను నియమిస్తారా? అన్నది తేలలేదు.

'మనబడి'కి నిధుల లేమి..?

మన ఊరు- మనబడి, మనబస్తీ-మనబడి పథకాన్ని ప్రభుత్వం గతేడాది జనవరిలో ప్రారంభించింది. రూ.7వేల కోట్లతో 26 వేల బడుల్లో 12 రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. మొదటి విడతలో రూ.3,497 కోట్లతో 9,123 బడుల్లో చేపట్టింది. బడుల ప్రాంగణం, తరగతి గదులకు రంగులు, కిచెన్ షెడ్ల నిర్వహణ, డిజిటల్ తరగతి గదుల నిర్మాణం, తాగునీరు, నిరంతర నీటితో కూడిన టాయ్‌లెట్ల నిర్మాణం వంటి వసతులు కల్పించడం ప్రధాన విధి. మొదట విడతలో సగం స్కూళ్లలోనే పనులు పూర్తి అయ్యాయి. మిగతా వాటిని షెడ్యూల్ ప్రకారం చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ గడువు పెట్టు కోలేదు. నిధుల లేమితో పనులు జరగడం లేదని తెలుస్తోంది.

భారీగా ఖాళీలు...

అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 21 వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదనపు పోస్టులు, రిటైర్‌మెంటు, ప్రమోషన్లు, బదిలీలు, తదితర కారణాలతో మొత్తంగా 28 వేల పోస్టులు ఖాళీ ఉన్నట్టు ఉపాధ్యాయసంఘాలు వెల్లడిస్తున్నాయి.స్కూల్ అసిస్టెంట్‌లు 7,111, ఎస్‌జీటీ 6,975 పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. 484 ఎంఇఒ పోస్టులకుగాను 467 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏ ఒక్క మండలానికి ఎంఇఒ లేరు. పిజి హెచ్ఎం గ్రేడ్-2 1947, గ్రేడ్-1 పోస్టులు 16కు గాను 15 , ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు 2,043 ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ డిఇఒ 62కు గాను 58, పిఇటి 99 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సంస్కృతంలో 23 పోస్టులుంటే మొత్తంగా ఖాళీనే. ఆర్ట్ డ్రాయింగ్ 331, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ 443 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

జిల్లాల వారీ ఖాళీలు...

జిల్లాల వారీగా చూస్తే ఖమ్మం జిల్లాలో 5,759 ఉపాధ్యాయులకు గాను 4,702 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇంకా 1,057 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అత్యధికంగా ఎస్‌జిటి తెలుగు 342 ఖాళీ ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,372 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఎస్‌జీటీలే 816 భర్తీ చేయాల్సి ఉంది. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 803 ఖాళీలకు గాను స్కూల్ అసిస్టెంట్ 187, ఎస్‌జిటిలు 616 వరకు, ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,499 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో మొత్తం ఉపాధ్యాయుల పోస్టులు 3,174 ఉంటే ప్రస్తుతం పని చేస్తున్న వారు 2,689. పెద్దపల్లిలో 168 పోస్టులు, జగిత్యాలలో 666, రాజన్నసిరిసిల్లలో 338 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 11,484 మంది ఉపాధ్యాయులు ఉండగా 991ఖాళీలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. హైదరాబాద్ జిల్లాలో 803 ఖాళీలుంటే, అందులో స్కూల్ అసిస్టెంట్‌లు 187, ఎస్‌జీటీలు 616 ఉన్నాయి. కామారెడ్డిలో 1,119 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఆ బడుల్లో నీటి సమస్య

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2,400 ప్రభుత్వ పాఠశాలలుండగా 80% మౌలిక వసతుల లేమితో ఉన్నాయి. మిషన్ భగీరథతో ప్రతి ప్రభుత్వ పాఠశాలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం చెప్పినా నేటికీ కనెక్షన్లు ఇవ్వలేదు. రంగారెడ్డి జిల్లాలోని శివరాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో 1600 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వాటర్ తాగితే యూరిన్‌కి వెళ్లాలని నీళ్ళు కూడా సరిపడా తాగట్లేదు. 'మన ఊరు-మన బడి' కింద ఎంపికైన పాఠశాలల్లో కొంత మేర మౌలిక వసతులు కల్పించారు. నిధుల లేమితో నూతన భవనాలు పూర్తి కాలేదు.

స్కూళ్లకు చేరని పుస్తకాలు, యూనిఫామ్స్

ఉమ్మడి మెదక్ జిల్లాలో 3,582 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. సిద్దిపేటలో తొలి విడత మన ఊరు..మన బడి కింద 343 స్కూల్స్ ఎంపిక చేయగా 100 బళ్లలోనే పనులు పూర్తయ్యాయి. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ స్కూళ్లల్లో 1,07,885 విద్యార్థులకు 5.19 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరముండగా 5.13 లక్షల పుస్తకాలు వచ్చాయి. దుస్తులు మాత్రం ఇంకా రాలేదు. ఇప్పటి వరకు బడిబాట కింద జిల్లాలో 5,612 మందిని నమోదు చేయించారు. మెదక్‌లో 97 స్కూల్స్‌లోనే పనులు వంద శాతం పూర్తయ్యాయి. మిగతా స్కూల్స్‌లో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 4.60 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరముండగా ఇప్పటికే 3.75 లక్షల పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. సంగారెడ్డిలో 158 స్కూల్స్‌లో పనులు పూర్తయ్యాయి. జిల్లాకు 10.38 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరముండగా ఇప్పటికే 4.32 లక్షల పుస్తకాలు మండలాలకు చేరాయి. స్కూల్స్ ప్రారంభంలోనే పుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తామని అధికారులు చెప్పినా వరంగల్ జిల్లాలో ఏర్పాట్లు జరగడం లేదు.

మరమ్మతులకు నోచని పాఠశాలలు

మరమ్మతులకు నోచని పాఠశాలలు చాలానే ఉన్నాయి. జిల్లా, పట్టణ కేంద్రాల్లోనూ ఇలాంటి సమస్యలున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 2,700 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గెజిటెడ్ నెంబర్ 1పాఠశాలలో సుమారు 500పైగా విద్యార్థులు ఉన్నారు. బడిలో మౌలిక సదుపాయాలు లేవు. ప్రస్తుతం ఈ పాఠశాలలో కిటికీలు ఊడిపోవడం, బేస్మెంట్ పగుళ్ళు తేలి ప్రమాదకరంగా మారాయి. ఇలా సమస్యల్లో పాఠశాలలు కొట్టుమిట్టాడుతుండగా నేటి నుంచి పున:ప్రారంభం కానున్నాయి.

ఏడవ కాలువ కట్టలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి

ఎన్ఎస్‌పి అధికారులకు కళ్లు లేవా..?

- అస్తవ్యస్తంగా సాగర్ ఎడమ కాలువ కట్టలు
- గండ్లతో పొంచి ఉన్న ప్రమాదం
- నష్టపోతున్న అన్నదాతలు
- ఎడమ కాలువ కట్టలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్ ఎడమకాలువ కట్టలు అస్తవ్యస్తంగా మారినా.. ప్రభుత్వానికి, ఎన్ఎస్‌పి అధికారులకు కళ్లు కనిపించడం లేదా అని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఇలాపురం, అన్నపురెడ్డిగూడెం గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న ఏడవ కాలువ కట్టలను రైతులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. సుమారు రెండు కిలోమీటర్ల వరకు కాలువల్లో నడిచి రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. లిఫ్టులను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న యాద్గారిపల్లి మేజర్ కాల్వ కట్టను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఎడమకాలువ ఆయకట్టు లైనింగ్ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. కాల్వ ఆధునీకరణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదని, కాల్వ మధ్యలో లైనింగ్ పనులు వదిలేశారని చెప్పారు. మిర్యాలగూడ మండలంలోని ఐలపురం, అన్నపురెడ్డిగూడెం కాలువల మధ్యలో సుమారు మూడున్నర కిలోమీటర్ల వరకు లైనింగ్ పనులు చేపట్టకపోవడంతో కాలువకట్టలు బలహీనంగా మారాయన్నారు. పంటలకు సాగునీరు విడుదల చేసే సమయంలో కాల్వ కట్టలు కోతకు గురై గండ్లు పడే అవకాశం ఏర్పడిందన్నారు. వర్షాకాలం సమయంలో కాలువకు గండ్లు పడి పంట పొలాలు, కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. గతంలో కూడా కాలువకు గండ్లు పడి పంట పొలాలు, కాలనీలు మునిగిపోయాయని, దీనివల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. మరో రెండు నెలలు వానాకాలం సీజన్ రాబోతుందని, బలహీనంగా ఉన్న కాలువకట్టను ఇలాగే వదిలేస్తే ప్రమాదం పొంచి ఉంటుందని చెప్పారు. ఈ రెండు నెలల కాలంలో మిగిలిపోయిన లైనింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లిఫ్టులు పనిచేయకపోవడంతో లిఫ్ట్ రైతులకు నీళ్ల పూర్తిస్థాయిలో అందటం లేదన్నారు. ఎల్ 11, 12, ఎల్13, 14లలో తూములను కిందికి దించాలన్నారు. కాలువ లైనింగ్ పనులు, లైఫ్టులను మరమ్మతులు చేపట్టకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గంగాజమునా కా తెహజీబ్‌కు ప్రతీక తెలంగాణ

- మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ

ప్రజాశక్తి - కల్చరల్

తెలుగు, ఉర్దూ భాషలు తెలంగాణా ప్రాంతంలో పాలు నీరులా కలసి వుంటాయని గంగాజమునాకా తెహజీబ్‌కు ప్రతీక తెలంగాణ రాష్ట్రమని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, పర్యాటక సాంస్కతిక శాఖామంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదిక పై తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సావాలలో భాగంగా సాహిత్య అకాడమీ, బాషా సాంస్కృతిక శాఖ నిర్వహణ లో సాహిత్యోత్సవం గా ఉర్దూ తెలుగు కవులు సమ్మేళనం జరిగింది. ఉర్దూ భాషా కవులు, తెలుగు భాషా కవులు పెద్ద ఎత్తున హాజరైన రవీంద్ర భారతి ఆడిటోరియం పండుగ వాతావరణం కనిపించింది. హెూమ్ మంత్రి మహమూద్ అలీ కవి సమ్మేళనంను ప్రారంభిస్తూ తెలంగాణలో ఉర్దూ ప్రాధాన్యత రాష్ట్ర ఆవిర్భావం తరువాత పెరిగిందన్నారు. గత కాలం ముఖ్యమంత్రులు పివి చెన్న రెడ్డి తప్ప ఎవరికి ఉర్దూ రాదని, ఇప్పుడు కెసిఆర్‌కు భాష పై పట్టు వుందన్నారు. ఉర్దూ తెలిసిన అధికారులకు ప్రముఖ్యత ఇస్తున్నారని తెలిపారు. ఉర్దూ తెలుగు కవులు ఒకే వేదిక పై కవిత్వం చదవటం అరుదైన సంఘటన అన్నారు. సాంస్కతిక పర్యాటక శాఖామంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ 33 జిల్లాలలో కవి సమ్మేళనం జరుగుతున్నాయి అని తెలిపారు. తెలంగాణ ప్రజలు కలసి మెలసి జీవించే సంస్కతి అని దర్వాజ, పరార్, చౌరస్థ వంటి ఉర్దూ పదాలు తెలుగు లో మిలిత మైనాయని వివరించారు. చివరి నైజాం కాలంలో కొంత ఇబ్బంది పడ్డా మంచి కూడా ఎక్కువ జరిగిందని అన్నారు. సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు కన్నీళ్లు, నెత్తురుతో నెల తడిసిందని రాష్ట్రం వచ్చినక నీళ్ల చెరువులు లతో కళ కళ లాడు తోంది అన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజిబుద్దీన్ మాట్లాడుతూ ఉర్దూ క్షవులకు ముగ్ధుమ్ మోహినుద్దీన్ పేరిట అవార్డ్స్ ఇస్తున్నామని తెలిపారు. ప్రజా వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న మాట్లాడుతూ మంచి చేసే ప్రభుత్వాలకు కవులు ప్రచారం చేయాలని ఇలా చైనాలో ఉందని తెలిపారు. అధికార భాష సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి, గ్రంధాల య పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, మైనార్టీ కమిషన్ చైర్మన్, సలహాదారు ఎకె ఖాన్ పాల్గొన్నారు. సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ పరవైవేక్షణ చేశారు.

తొమ్మిదేళ్లు గడిచినా ఆర్‌టిసి కార్మికుల కష్టాలు పోలేదు

- తక్షణమే వారి సమస్యలు పరిష్కరించండి
- సిఎం కెసిఆర్‌కు మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తొమ్మిదేండ్ల పాలనలో ఆర్టీసీ కార్మికుల కష్టాలు తీరలేదని మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. ఈ ఎన్నికల ఏడాదిలో కేవలం హామీల పేరుతో మరొకసారి ఆర్టీసీ ఉద్యోగులను మోసం చేసే ప్రయత్నం చేయకుండా ప్రగతి భవన్ వేదికగా ఇచ్చిన హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాల కోరారు. ఆర్టీసీలో ఖాళీలు వేల సంఖ్యలో ఉన్నప్పటికీ ఎందుకు నియామకాలు చేపట్టలేదో తెలపాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలల్లో ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తానంటూ చెప్పి ఏండ్లు గడిచినా ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు. పిఎఫ్, సిసిఎస్ బకాయిలు పేరుకుపోతున్నప్పటికీ ఈ నిధులను విడుదల చేయడంలో సీఎంతో సహా అధికారులు సైతం శ్రద్ధ చూపడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉచిత బస్సు పాసులు, ఉద్యోగుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య సదుపాయం, ఉద్యోగులకు గృహ నిర్మాణం హామీలు విస్మరించారని తెలిపారు. స్వరాష్ట్ర సాధన కోసం యుద్ధంలో తమ వీరత్వాన్ని చూపిన ఆర్టీసీ కార్మికుల త్యాగాలను గుర్తించి వారిని ఆదుకోవాలనీ, ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే

- ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా తెలంగాణలో వచ్చేది బిఆర్ఎస్ సర్కారేనని మెదక్ ఎంపీ , బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి ధీమాను వ్యక్తం చేశారు. దుబ్బాక నియోజకవర్గంలోని దౌల్తాబాద్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు డప్పు శివరాజుతో పాటు దుబ్బాక నియోజకవర్గంలోని రెండు వందల మంది ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఆదివారం బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీ మాట్లాడుతూ కేవలం తొమ్మిదేండ్లలో తెలంగాణ అన్ని రంగాల్లో నెంబర్‌వన్‌గా నిలిచిందని అన్నారు. 70 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఓట్ల కోసం తప్పా దళితుల గురించి పట్టించుకోలేదన్నారు. దేశంలో దళితుల సంక్షేమం కోసం పని చేసిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ సర్కారేనని స్పష్టం చేశారు. దళితబంధు పథకంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని సీఎం కేసీఆర్ తిప్పి కొడుతూ దశలవారీగా అమలుచేసి దేశానికి స్ఫూర్తిగా నిలిచారని గుర్తుచేశారు. తెలంగాణ తరహా అభివృద్ధి,సంక్షేమ పథకాలు దేశంలో అమలు చేసే ప్రయత్నంలో భాగంగానే సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని జాతీయ రాజకీయాల్లో కీలకంగా మార్చారన్నారు. దుబ్బాక ఉప ఎన్నికలో బిజెపి అసత్య ప్రచారంతో ప్రజలను మోసగించిందన్నారు.

ధూమ్ ధామ్‌గా తెలంగాణ అవతరనోత్సవం

ప్రజాశక్తి-కల్చరల్

భారత్ ఆర్ట్స్ అకాడెమీ, ఎబిసి ఫౌండేషన్‌ల సంయుక్త అధ్వర్యంలో త్యాగరాయ గానసభలో తెలంగాణ ధూంధాం, తెలంగాణ ఐకాన్ ఆఫ్ ది ఇయర్, తెలంగాణ కిరణం అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఎబిసి ఫౌండేషన్ అధ్యక్షుడు లయన్ కెవి రమణారావు, భారత్ ఆర్ట్స్ అకాడెమీ అధ్యక్షురాలు లయన్ లలితారావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జరిగింది. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా వివిధ రకాల నృత్యంశాలు నృత్య కళాకారులు ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా హాజరై అవార్డులను ప్రధానం చేసి ప్రసంగించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పోలీసు ఉన్నతాధికారి రామ్ దాస్ తేజావత్, టీవీ యాంకర్ బాలాజీ, ప్రముఖ నత్య గురువు ఓలేటి రంగమని, మేము సైతం యువసేన ఫౌండేషన్ అధ్యక్షురాలు చక్కిలం స్వప్న, నృత్య గురువులు ఓలేటి రేఖ, విజయలక్ష్మి, అంజనా దేవ్, మౌనిక, అచ్యుతాంబ, ఆశ, శ్రీ రంగాచార్య మ్యూజిక్ అకాడమీ అధినేత్రి, ప్రముఖ సంగీత విద్వాంసురాలు విష్ణు ప్రియ, సంగీత ఉపాధ్యాయులు లలిత, అంజన, హిమబిందు, పాశ్చత్య సంగీత కళాకారులు సంపత్, చింటూ, ప్రవీణ్ , అర్జున్ తదితరులు తమ శిష్య బృందంతో కలిసి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు లయన్ కెవి రమణారావు సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన కొల్లేటి దామోదర్ గుప్తా మాట్లాడుతూ భారత్ ఆర్ట్స్ అకాడెమీ ఎబిసి ఫౌండషన్స్‌లు ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని చాటే సాంప్రదాయ నృత్యమైన పేరిణి నాట్య ప్రదర్శనలు ప్రోత్సాహిస్తున్నారన్నారు. ఇవి ఆకట్టుకున్నాయని తెలుపుతూ తెలంగాణ సంస్కృతినీ సంప్రదాయాలను, కళలను ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలు చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఉప సంచాలకులు రఘునందన రావులు నిర్వాహకులను అభినందించారు.

ప్రతి ఇల్లూ ఓ పోరాట కేంద్రంగా మారాలి

- ఆడబిడ్డలకు న్యాయం కోసం కదలిరండి
- వెబినార్‌లో ఐద్వా అఖిల భారత కోశాధికారి ఎస్.పుణ్యవతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రెజ్లర్ల పోరాటం స్ఫూర్తిదాయకమనీ, వారంతా తమ ఇంట్లోని ఓ ఆడబిడ్డగానే భావించి ప్రతి ఇంటినీ ఓ పోరాట కేంద్రంగా మార్చాలని ప్రజలకు ఐద్వా అఖిల భారత కోశాధికారి ఎస్.పుణ్యవతి పిలుపునిచ్చారు. దేశమంతటా సర్వత్రా విమర్శలొస్తున్నా ఎంపి బ్రిజ్‌భూషణ్‌సింగ్‌ను అరెస్టు చేయకుండా బిజెపి సర్కారు మొండిగా ముందుకెళ్తున్నదని విమర్శించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహిళా రెజ్లర్ల పట్ల మనువాదుల దురహంకారం అనే అంశంపై ఆదివారం వెబినార్ జరిగింది. ఈ సందర్భ:గా పుణ్యవతి మాట్లాడుతూ.. దేశ చరిత్రను ఆడబిడ్డలు తిరగరాస్తారనీ గురజాడ చెప్పినట్టుగానే క్రీడలతోపాటు అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారనీ, దేశ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేస్తున్నారని అన్నారు. అది గిట్టకే మనువాదులు ఆడబిడ్డలను అణచివేస్తున్నారనీ, మనుధర్మ శాస్త్రం ప్రకారం అణిగిమనిగి ఉండేలా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ వేదికల మీద దేశ చరిత్రను ఇమిడింపజేసిన మహిళా రెజ్లర్ల పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరు సరిగాదన్నారు. అమ్మాయిలు రోడ్లెక్కి పోరాటం చేస్తుంటే అంతర్జాతీయంగా మన పరువు, మర్యాద పోతుందనే ఆలోచన కూడా మోడీ సర్కారుకు ఎందుకు కలగడంలేదని ప్రశ్నించారు. న్యాయం అడిగితే.. పతకాలు తెచ్చిన ఆడబిడ్డలను జైళ్లలో పెట్టడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. తాత్కాలికంగా తమ పోరాటాన్ని వాయిదా వేస్తున్నామని రెజ్లర్లు స్పష్టంగా ప్రకటిస్తే... బిజెపి సోషల్ మీడియా వారిపై అసత్య, అసభ్యకరంగా ప్రచారాలు చేయడం దుర్మార్గమన్నారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని రెజ్లర్లు కోరుతున్న డిమాండ్‌లో న్యాయం ఉందన్నారు. నిందితులను వదిలేసి బాధితులను వేధించడం దారుణమన్నారు. అధికారం అనుభవించేవాళ్లకు ఒక న్యాయం? సామాన్యులకు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు.

పెరిగిన వ్యయం... తగ్గిన సాగు

కూరగాయల పంటలపై రైతులు వెనకడుగు

మూడేళ్లలో 62 వేల ఎకరాల తగ్గుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి, ఆయిల్‌పామ్ వంటి పంటల సాగు గణనీయంగా పెరుగుతుండగా, కూరగాయల సాగు నానాటికీ క్షీణిస్తోంది.

గత మూడేళ్ల వ్యవధిలో 62 వేల ఎకరాల మేరకు తగ్గింది. సాగు వ్యయం పెరగడంతోపాటు గిట్టుబాటు ధరలు రాకపోవడంతో ఈ పంటల సాగును తగ్గిస్తున్నట్టు రైతులు చెబుతున్నారు.రాష్ట్రంలో 2019లో 3.73 లక్షల ఎకరాల్లో కూరగాయలు సాగయ్యేవి. కాళేశ్వరం జలాశయం నీరు అందుబాటులోకి వచ్చాక రాష్ట్రంలో పంటల సాగు భారీగా పెరిగింది. దీంతో కూరగాయల సాగు కూడా పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. దీనికి భిన్నంగా కూరగాయల సాగు గత మూడేళ్లుగా తగ్గుతూ వస్తోంది. 2020లో 14 వేలు, 2021లో 21 వేలు, 2022లో 27 వేల ఎకరాల్లో ఈ పంటల సాగు తగ్గింది. రంగారెడ్డి జిల్లాలో 62 వేల ఎకరాల నుంచి 49 వేల ఎకరాలకు, వికారాబాద్‌లో 45 వేల ఎకరాల నుంచి 23 వేల ఎకరాలకు, మహబూబ్‌నగర్‌లో 24 వేల ఎకరాల నుంచి 14 వేల ఎకరాలకు సాగు విస్తీర్ణం పడిపోయింది. దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఇది ఉత్పత్తిపైనా ప్రభావం చూపుతోంది. రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తి 34 లక్షల టన్నుల నుంచి 23 లక్షల టన్నులకు పడిపోయింది. కూరగాయల సాగులో రాష్ట్రం స్థానం 15 స్థానానికి, ఉత్పత్తిలో 14వ స్థానానికి దిగజారింది. ఫలితంగా బెండ, బంగాళాదుంప, చిక్కుడు, పొట్లకాయ, కొత్తిమీర, పుదీనా వంటివి కూడా మహారాష్ట్ర, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కూరగాయల విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలతోపాటు కూలీల ఖర్చులు పెరగడం, పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడం వల్లనే సాగును కొనసాగించడం లేదని రైతులు చెబుతున్నారు.

కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిపై కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



బిఆర్ఎస్ కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సామ ఇంద్రపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. 2018లో ఉప్పరపల్లిలో ఓ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు సామ ఇంద్రపాల్ రెడ్డి ప్రయత్నించారు. అదే సమయంలో మధ్యవర్తులుగా ఎమ్మెల్యే పట్నం నరేందర్, రాకేశ్ రెడ్డి అతనికి పరిచయమయ్యారు. తమకు తెలిసిన మరికొందరు భూస్వాములు ఉన్నారని వీరిద్దరు శ్రీరామ్ రెడ్డి అనే మరో వ్యక్తిని ఇంద్రపాల్ రెడ్డికి పరిచయం చేశారు. స్థలం, కమీషన్‌తో కలిపి మొత్తం రూ.3.65 కోట్లకు భూమి అమ్ముతామన్నారు. కమీషన్ ఇచ్చేందుకు ఇంద్రపాల్ కూడా అంగీకరించారు. ఈ క్రమంలో 2018 మే 24న రూ.90లక్షలు చెల్లించాడు. తర్వాత విడతల వారీగా మొత్తం రూ.3.05 కోట్లు చెల్లించాడు. సెక్యూరిటీ కింద ఎమ్మెల్యే, రాకేశ్‌రెడ్డిలు బాధితుడి వద్ద బ్లాంక్ చెక్కులు తీసుకున్నారు. మిగిలిన రూ.60లక్షల కోసం లోన్‌కు అప్లై చేశానని అది రాగానే చెల్లిస్తానని చెప్పాడు. ఈ సొమ్ము చెల్లించడానికి ఆలస్యం అవుతుందని.. ఎమ్మెల్యే తరపున అనుచరులు ఇంద్రపాల్‌పై బెదిరిం పులకు పాల్పడ్డారు. గతేడాది జూన్‌లో తన ఇంటికి వచ్చి భార్య ను బెదిరించారని, తనను గదిలో బందించి తీవ్రంగా కొట్టారని ఫిర్యా దులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే తన గన్‌మెన్‌ను పంపించి చంపేం దుకు ప్రయత్నించారని తెలిపారు. వారి చెర నుంచి తప్పించుకొని ఇంద్రపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు ఫిర్యాదులో తెలిపాడు. తాను పోలీసులను ఆశ్రయించినప్పటి నుంచి రూ.2.5 కోట్లు ఇస్తేనే గతంలో తాను ఇచ్చిన బ్లాంక్ చెక్కులపై ఎలాంటి చర్యలు తీసుకోమని, డిమాండ్ చేసిన డబ్బును చెల్లించకపోతే చెక్ బౌన్స్ కేసు పెడతామని బెదిరించారని ఇంద్రపాల్ ఫిర్యాదులో వెల్లడించారు. తాను ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించు కోకపోవడంతో నేరుగా హైదరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లానని, అక్కడి నుంచి కేసును పశ్చిమ మండల డిసిపికి రిఫర్ చేశారని బాధితుడు తెలిపారు.